www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 29 డిసెంబర్ 2024

5

తూర్పుగోదావరి

వాలంటీర్ల కవాతు

ఎరుపెక్కిన రాజమహేంద్రి

కోటిపల్లి బస్టాండ్ వద్ద జరిగిన బహిరంగ సభలో సిపిఎం నాయకులు సంఘీభావం

- ఉత్సాహంగా ప్రారంభమైన సిపిఎం జిల్లా మహాసభ
- నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ
- చైతన్యాన్ని నింపిన నాయకుల ప్రసంగాలు

ఎర్ర జెండాలతో చారిత్రాత్మక రాజమహేంద్రవరం నగరం ఎరుపెక్కింది. రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతుతో నగర వీధులు అరుణార్ణవాన్ని పులుముకున్నాయి. మున్సిపల్ స్టేడియం నుంచి కోటిపల్లి బస్టాండ్ వరకూ నిర్వహించిన ప్రజా ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. ప్రదర్శన అగ్ర భాగాన 24 జెండాలను పట్టుకుని రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు ప్రత్యేక ఆకర్షణగానిలిచింది. తీన్‌మార్ డప్పులు, ప్రజల నినాదాలతో దద్దరిల్లింది. ప్రజానాట్య మండలి కళాకారులు గీతాలు ఉత్సాహపరచగా... సిపిఎం తూర్పుగోదావరి జిల్లా మహాసభ శనివారం ప్రారంభమైంది.

:: ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి ::

సభకు హాజరైన జనం

కందుకూరి స్ఫూర్తితో విశాల ఉద్యమాలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు

ప్రముఖ సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం స్ఫూర్తితో విశాల పోరాటాలకు ప్రజలు సంసిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా మహాసభలో భాగంగా కోటిపల్లి బస్టాండ్ వద్ద జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అధ్యక్షతన బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభను ఉద్దేశించి వి.ఉమామహేశ్వరరావు మట్లాడారు. కూటమి ప్రభుత్వం లౌకిక తత్వంవైపా? సనాతన ధర్మం వైపా? అనేది ప్రజలకు చెప్పాలన్నారు. బాల్య వివాహాలు, సతీసహగమనం వంటి దురాచారాలకు వ్యతిరేకంగానూ, వితంతు పునర్వివాహాల కోసం, బాలికల విద్య కోసం కందుకూరి చేసిన పోరాటాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆర్‌ఎస్ఎస్ పక్షాన బిజెపి అనుసరిస్తున్న విధానాలు వీటన్నింటికీ వ్యతిరేకమన్నారు. సనాతన ధర్మాన్ని భుజాన వేసుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చాతుర్వర్ణ వ్యవస్థను సమర్ధిస్తారా..? అని నిలదీశారు.

రాజకీయ చైతన్యంతోనే ప్రత్యామ్నాయం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం

రాజకీయ చైతన్యంతోనే ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటవుతుందని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఆరు నెలల్లోనే చంద్రబాబు పాలన ఘోరంగా విఫలమైందన్నారు. అనేక హామీలతో ప్రజలను మభ్యపెట్టి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. పాలకులు మారినా ప్రజల కష్టాలు మారలేదన్నారు. అవినీతిలో గత ప్రభుత్వంతో కూటమి ప్రభుత్వం పోటీ పడుతుందన్నారు. ప్రత్యామ్నాయ విధానాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రజల్లో రాజకీయ చైతన్యం మరింత పెరగాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు సిపిఎం ఒక్కటే ప్రత్యామ్నాయమని తెలిపారు.

ప్రజా సమస్యలపై చొరవ చూపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

ప్రజా సమస్యలపై పాలకులు చొరవ చూపాలని జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ నూతన జిల్లా ఏర్పడి రెండున్నరేళ్లు గడిచినా ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు నిధులు కేటాయించలేదన్నారు. ఫలితంగా ప్రజలు తమ సమస్యలు విన్నవించుకునేందుకు అనేక వ్యయప్రయాసలతో బొమ్మూరులోని తాత్కాలిక కలెక్టరేట్‌కు వెళ్లాల్సి వస్తుందన్నారు. వ్యవసాయంపై అత్యధికంగా ఆధారపడిన ఈ జిల్లాలో సాగుకు ప్రోత్సాహం కరువైందన్నారు. నిడదవోలు, ఉండ్రాజవరం, గోదావరి డెల్టాలో పంట నష్టపోయిన రైతులకు ఇప్పటికీ పరిహారం అందలేదని విమర్శించారు. జిల్లాలో 31 పరిశ్రమలు ఉన్నాయని కరోనా అనంతరం వేతన ఒప్పందం అమలు చేయడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ఆయా పరిశ్రమల్లో పనిచేస్తున్న 22 వేల మంది కార్మికులు భారంగా బతుకీడ్చుతున్నారని వాపోయారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఒఎన్‌జిసిలో కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మకై కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. పేపరు మిల్లు యాజమాన్యం సైతం చేసిన వేతన ఒప్పందాన్ని అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు జరిగి పదేళ్ల గడిచిందన్నారు. ప్రజల నుంచి వసూళ చేసిన పన్నులు ప్రత్యేకాధికారి పాలనలో ఇష్టారాజ్యంగా ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. తాగునీటికి, మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించకపోగా గత ప్రభుత్వం ఆహ్లాదం పేరుతో కోట్లు రూపాయల నిధులను దుర్వినియోగం చేసిందన్నారు. 2027 పుష్కరాలకు సుమారు 2 కోట్ల మంది వస్తారని పాలనా యంత్రాంగం అంచనా వేస్తుందన్నారు. నగరంలో ఇప్పటికే ప్రజల అవసరాలకు తగ్గట్లుగా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవటంతో చిన్నపాటి వర్షాలకే ముంపునకు గురౌతుందని గుర్తు చేశారు. నగరాభివృద్ధిపై దృష్టి సారించకపోతే ఆగస్టులో వచ్చే వరదలకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యే అవకాశాలున్నాయని హెచ్చరించారు. ప్రస్తుతం పాలకులు చొరవ చూపించి జిల్లా అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని లేనిపక్షంలో గత పాలకులకు పట్టిన దుస్థితి పునరావృతం కావడం ఖాయమన్నారు.

ప్రజాప్రదర్శనలో అగ్రభాగాన నడుస్తున్న నాయకులు

జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ కొన్నేళ్లుగా జిల్లాలో దళితులు, మైనార్టీలు, క్రిస్టియన్‌లు, మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఈ దాడులకు వ్యతిరేకంగా సిపిఎం చేసిన పోరాటాలను, సాధించిన విజయాలను గుర్తు చేశారు. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆర్‌ఎస్ఎస్ విధానాలను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుందరబాబు, కెఎస్‌వి.రామచంద్రరావు, వై.బేబిరాణి, పి.తులసి, బి.పవన్, ఎస్.రాజా, సీనియర్ నాయకులు ఎస్ఎస్ మూర్తి, పోలిన వెంకటేశ్వరరావు, టిఎస్.ప్రకాష్, ఐద్వా నాయకులు జరీనా, వెంకటలక్ష్మి, సిపిఎం నగర కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతినిధుల సభ ప్రారంభం

బహిరంగ సభ అనంతరం రౌతు తాతాలు కళ్యాణమండపంలో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. వంద మంది ప్రతినిధులు హాజరయ్యారు. తొలుత సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుందర్‌బాబు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఆలిండియా కార్యదర్శి సీతారాం ఏచూరి, పశ్చిమ గోదావరి జిల్లా సిపిఎం సీనియర్ నాయకులు రుద్రరాజు సత్యనారాయణ (ఆర్ఎస్), ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్‌సాబ్జీ, సిఐటియు తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి బి.రాజులోవ, సిపిఎం రంపచోడవరం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మంత్రి మనోహర్‌ను సత్కరిస్తున్న ఎంఎల్ఎ బత్తుల

మంత్రికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-కోరుకొండ

జిల్లా పర్యటనకు వచ్చిన పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌కు మధురపూడి విమానాశ్రయంలో శనివారం ఘనస్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో మధ్యాహ్నం 3.30 గంటలకు మంత్రి మనోహర్ మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ, జెసి చిన్నరాముడు, కూటమి నాయకులు నీరుకొండ వీరన్న చౌదరి ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి రాకతో విమానాశ్రయంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

31న పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి-చాగల్లు

ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో జనవరి 1 నిర్వహించాల్సిన పెన్షన్ పంపిణీ కార్యక్రమం ఒక రోజు ముందు అనగా డిసెంబర్ 31న పంపిణీ చేస్తున్నట్టు ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి తెలిపారు. మండలంలో అన్ని గ్రామాల్లో పెన్షన్ దారులు అందరూ ముందు రోజే గ్రామంలో అందుబాటులో ఉండాల్సిందిగా ఎంపిడిఒ తెలిపారు.

పిసిపిఎన్‌డిటి యాక్ట్ అమలుపై శిక్షణ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) హాల్లో డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వర రావు అధ్యక్షతన శనివారం ప్రైవేటు, ప్రభుత్వ స్కానింగ్ సెంటర్ల సిబ్బందికి పిసిపిఎన్‌డిటి యాక్ట్ అమలు తీరు, సంస్థగత నిర్మాణంపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గర్భస్థ నిర్ధారణ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జనాభా పెరుగుదలలో లింగ నిష్పత్తిలో వ్యత్యాసం కనిపిస్తున్న దృష్ట్యా ప్రతి స్కానింగ్ సెంటర్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిషేధం బోర్డులను ప్రదర్శించాలని స్పష్టం చేశారు. రిజిస్టర్ స్కానింగ్ సెంటర్స్ నిర్దేశించిన విధంగా ఫారం ఎఫ్‌లు ప్రతినెలా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. సమాజంలో జెండర్ నిష్పత్తి సమానత్వం ప్రాముఖ్యతను విస్మరిస్తూ, బాలికల ప్రాధాన్యతను తెలియజేశారు. వివిధ స్కానింగ్ సెంటర్స్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడంలో, వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఆయా సందర్భాల్లో డెకాయ్ ఆపరేషన్స్‌కు సహకారం అందించాలని కోరారు. స్కానింగ్ సెంటర్స్ మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలని కోరారు. అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించే క్రమంలో బాధ్యతతో కూడిన సహకారం అందించాలని పేర్కొన్నారు. డాక్టర్ పిఎస్ఎల్.ప్రసన్న మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్‌లో గర్భిణులకు స్కానింగ్ చేసినప్పుడు వారికి గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు జరపరాదని లింగ నిర్ధారణ పరీక్షలు ఎక్కడైనా జరిగితే వాటికి భారతీయ శిక్షాస్మృతిలో 1994 యాక్ట్ ప్రకారం మొదటిసారి రూ.50 వేల జరిమానా ఒక సంవత్సరం జైలు శిక్ష విధించి, వారి లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఇటువంటి లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది క్షేత్ర స్థాయిలో డెకాయ్ ఆపరేషన్స్‌కు సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సంధ్య, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగరత్నం, సిడిపిఒ నర్సమ్మ, డిప్యూటీ డెమో సత్య కుమార్ నల్లూరి, స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ వెంకటేశ్వరరావు

సమన్వయంతో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ సూచించారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీలకతీతంగా సభ్యులందరూ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని, సమస్యలను ఉన్నతాధికారులకు విన్నవించి పరిష్కరించుకోవాలని తెలిపారు. మండలానికి పెద్దదిక్కుగా, ముగ్గురు ఎంఎల్‌సిలు నియోజకవర్గానికి చెందిన మంత్రి, ఉండగా మండలంఒ అత్యంత సమర్థవంతమైన పరిపాలన కొనసాగించేలా అధికారులు, నాయకులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తొలుత మండల సభ్యులు, అధికారులు, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పెరవలి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బూరుగుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల నిషేధం ద్వారా డ్రైనేజీలు పూడుకు పోకుండా అరికట్టవచ్చన్నారు. పలు పంచాయతీల సర్పంచులు పలు సమస్యలను లేవనెత్తారు. కె.సావరంలో అభివృద్ధి పనులకు ఆటంకంగా అదనంగా ఉండి, అవసరం లేని విద్యుత్ స్తంభాలను తొలగించాలని, పసలపూడిలో దుర్వినియోగమైన నిధులను వెనుకకు రాబట్టాలని, మంచినీటి పైపుల నిర్మాణం కోసం తవ్వకాలు జరిపి, పైపులు లేవన్న కారణంగా తవ్విన గోతులు ఉంచకుండా పూడ్చి వేయాలని పలు గ్రామాల సర్పంచులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మల్లు సందీప్, ఎంపిడిఒ వివివిఎస్.రామారావు, ఇఒపిఆర్‌డి ఆంజనేయ శర్మ, ఎంపిటిసిలు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి రవీంద్రనాథ్

కార్టూ'నిజం'



భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

ప్రజాశక్తి-చాగల్లు, సీతానగరం

గ్రామస్థాయిలో భూముల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహశీల్దారు ఎం.మెరికమ్మ అన్నారు. శనివారం మండలంలోని నందిగంపాడు పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ పరిధిలోని భూ సమస్యలను బాధితుల నుండి అడిగి తెలుసుకున్నారు. 14 ఫిర్యాదులు వచ్చినట్టు ఆమె తెలిపారు. ఇందులో భూ సర్వే చేయాలని ఆరు, పాస్ బుక్‌ల కోసం నాలుగు, మీ సేవ ఫిర్యాదులు నాలుగు వచ్చినట్లు ఆమె తెలిపారు. మండలంలో రెవెన్యూ సదస్సులు ముగిసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుదప రాంబాబు, రెవెన్యూ సిబ్బంది డిటి టి.శ్రీనివాస్, ఆర్ఐ కమల్ పాల్గొన్నారు.

సీతానగరం నల్లగొండ పంచాయతీ పరిధిలో తహశీల్దారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో భూ సమస్యలకు సంబంధించి ఏడు అర్జీలు అందినట్టు తహశీల్దారు తెలిపారు. ఈ సదస్సులో బాధిత రైతుల నుంచి భూమి సర్వేకు సంబంధించి, పంచాయతీకి సంబంధించి, ఎండోమెంట్‌కు సంబంధించి అర్జీలు దాఖలు చేశారు. తహశీల్దారు శ్రీనివాస్ మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కారం చెయ్యాడానికి రెవెన్యూ గ్రామసభలో ఇందుకు సంబంధించిన రికార్డులను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అర్జీలను 33 రోజుల్లో పరిష్కారం చెయ్యాడానికి యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు.

సీతానగరంలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న తహశీల్దారు శ్రీనివాస్

రెవెన్యూ అంశాలపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

కలెక్టర్ పి.ప్రశాంతి తన క్యాంపు కార్యాలయంలో శనివారం జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, డిఆర్ఒ టి.సీతారామ్మూర్తి, కలక్టరేట్ ఎఒ ఎం.అలీతో రెవెన్యూ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ రెవెన్యూ సదస్సులను పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలనారు. రెవెన్యూ శాఖ మంత్రి కలెక్టర్లతో నిర్వహించనున్న ప్రాంతీయ సదస్సులో ఫ్రి హోల్డ్ భూముల పున్ణపరిశీలన స్థితి, ప్రజా సమస్యల పరిష్కార విధానం, నీటి పన్ను, ప్రభుత్వ భూముల రక్షణ, ఆక్రమణల క్రమబద్ధీకరణ, ఇంటి స్థలాల స్థితి, గ్రామసభ ఫిర్యాదుల పరిష్కార స్థితి, సర్వే రాయిపై పేర్ల తొలగింపు అంశాలపై సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఈ క్రమంలో జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల స్థాయి పనితీరుపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉందని తెలిపారు. గ్రామ రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను తప్పనిసరిగా పిజిఆర్ఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రుల, రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారుల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయి అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ఆదివారం పన్ను చెల్లింపునకు అవకాశం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

వార్డు సచివాలయ పరిపాలనా కార్యదర్శులందరూ ఆదివారం కూడా పన్ను చెల్లింపుదారులకు అందుబాటులో ఉండాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 024-2025 రెండో అర్థసంవత్సరము యొక్క ఆస్తి పన్ను అపరాధ రుసుము లేకుండా చెల్లించే అవకాశం డిసెంబర్ 31తో ముగియనుందని తెలిపారు. దీంతో ఆస్తి పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం ఆదివారం కూడా నగరపాలక సంస్థలో స్పెషల్ కౌంటర్ తెరిచి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

జనవరి 4న విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఎస్ఐఎస్ఎఫ్-2025 జిల్లా స్థాయిలో జనవరి 4న శ్రీసత్యసాయి గురుకులంలో నిర్వహిస్తున్నట్టు జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం బెంగళూరు వారి సహకారంతో జిల్లా విద్యాశాఖ ఈ సైన్స్ ఫెయిర్-2025 ను ప్రభుత్వ పాఠశాలలోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పాఠశాల స్థాయి, మండల స్థాయిల్లో పోటీలు నిర్వహించుకుని, మండల స్థాయిలో బెస్ట్ ప్రాజెక్టులను జిల్లా సైన్స్ ఫెయిర్‌కు పంపాలన్నారు. ప్రాజెక్టు నమూనాలు సమకాలీన సమాజ సమస్యలకు పరిష్కారం చూపే విధంగాను, నూతనత్వంతో కూడినవిగాను, తార్కికంగా ఆలోచింపచేసే విధంగా వర్కింగ్ మోడల్స్ మాత్రమే ప్రదర్శించాలని తెలిపారు. థర్మోకోల్‌తో ఎటువంటి మోడల్స్ తయారు చేయద్దని సైన్స్ ఉపాధ్యాయులకు సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి జివిఎన్ఎస్.నెహ్రూను సంప్రదించాలని డిఎస్ఇఒ వాసుదేవరావు తెలిపారు.

నేడు కబడ్డీ బాల బాలికల జట్ల ఎంపిక

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జనవరి నెలలో 3, 4, 5 తేదీల్లో నిర్వహించే 50వ అంతర్ జిల్లాల కబడ్డీ ఛాంపియన్‌షిప్‌నకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కబడ్డీ జట్లను ఆదివారం ఆర్ట్స్ కాలేజీ కబడ్డీ గ్రౌండ్‌లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామనిజిల్లా కబడ్డీ అసోసియేషన్ కన్వీనర్ ఎవిడి ప్రసాదరావు తెలిపారు. ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ వంశీకృష్ణ, జనరల్ సెక్రెటరీ పద్మజాబాల ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. క్రీడాకారులు బాలురు 70 కేజీలు, బాలికలు 65 కేజీలు ఉన్నవారు మాత్రమే పోటీలకు అర్హులని, తప్పనిసరిగా ఆధార్ కార్డు, జిరాక్స్ తీసుకురావలెనని ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు, పీడీలు తమ విద్యార్థులను ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌కు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు తీసుకురావాలని తెలిపారు.

ప్రయివేటుఆసుపత్రుల్లో నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిబంధనలు తప్పక పాటించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఎపి ప్రభుత్వం ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం, 2002, 2007 నిబంధనల ప్రకారం ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వహణలో పారదర్శకత, నియంత్రణ కోసం కార్యాచరణ రూపొందించినట్టు తెలిపారు. ఆసుపత్రులను నిబంధనల ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇది లేకుండా సేవలు అందించడం చట్ట విరుద్ధమని తెలిపారు. రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేకుండా సేవలను అందించరాదని, ఆసుపత్రులు రోగుల నుంచి అధిక రుసుములు వసూలు చేయడం, నిబంధనలను ఉల్లంఘించినా చర్యలు తప్పవన్నారు. రోగుల సేవలకు సంబంధించిన ప్రతి అంశంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని, ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత ఆసుపత్రులపై ఆసుపత్రి రిజిస్ట్రేషన్ రద్దు, పెద్ద మొత్తంలో జరిమానా విధింపు, సంబంధిత వారిపై ఫిర్యాదులు నమోదు చేయడం, వంటి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మామిడి సస్యరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - కోరుకొండ

ప్రస్తుత వాతావరణంతో మామిడి తోటలలో రైతులు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలపై తీసుకోవలసిన చర్యలపై ఉద్యానశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని గాదరాడ, బూరుగుపూడి, నరసాపురం గ్రామాల్లోని మామిడి తోటలను కోరుకొండ ఉద్యానవన శాఖ అధికారి రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ప్రస్తుత సీజన్‌లో మామిడి చెట్లు పూత సమయంలో ఉన్నాయని, పదేపదే పురుగు మందుల వాడకం చేపట్టకూడదని తెలిపారు. ఉద్యానవన అధికారులు ఇచ్చే సూచనలను రైతులు పాటించి చీడ పీడలను నివారించుకోవాలని తెలిపారు.

నేరాలు ఘోరాలు

బైకును ఢీకొన్న కారు

ప్రజాశక్తి - పిఠాపురం

మండలం ఎస్‌కె పాలెం గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. స్థానికులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దాపురం నుంచి మోటార్ సైకిల్‌పై అన్నదమ్ములు ఎం.రాజ్‌కుమార్, వసంతకుమార్ జల్లూరు మీదుగా భోగాపురం గ్రామంలో బంధువుల ఇంటికి వస్తున్నారు. వారిని ఎస్‌కె పాలెం వద్ద పిఠాపురం నుంచి సామర్లకోట వెళ్తున్న కారు ఢీకొట్టడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వైద్యం నిమిత్తం వారిని స్థానికంగా ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు గ్రామానికి చెందిన 16 సంవత్సరాల బాలిక అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 7 గంటలు చేబ్రోలు గ్రామానికి చెందిన 16 సంవత్సరాల బాలిక పిఠాపురం కాలేజీకి వెళ్లింది. అయితే సాయంత్రానికి తిరిగి ఆమె ఇంటికి రాలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధి లో శనివారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. మండలంలోని చదలాడ గ్రామంలో నిర్వహించిన దాడుల్లో 400 లీటర్లు, సూరంపాలెం గ్రామంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్లు బెల్లపు ఊటను ధ్వంసం చేసామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు చిట్టిబాబు, ప్రసాదరావు పాల్గొన్నారు.

12 మంది బైండోవర్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో 12 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు. వీరందరినీ సీతానగరం తహశీల్దార్ ఎ.శ్రీనివాస్ వద్ద హాజరుపరిచి సత్ప్రవర్తనతో ఉండేలా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. బైండోవర్ ఉత్తర్వులు ఉల్లంఘించి ప్రవర్తిస్తే వారిపై రూ.2 లక్షలు జరిమానా విధిస్తూ, చట్టవిరుద్ధ పనులు చేసేవారిగా గుర్తిస్తూ తదుపరి చర్యలు తీసుకోంటామని హెచ్చరించారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఆత్రేయపురంలో ఒక వ్యక్తి మృతి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. దీనిపై శనివారం పోలీసు వివరాల ప్రకారం పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన గణేష్ మాజీ వ్యవసాయ పనులు చేసుకునేందుకు తోటి కూలీలు 15 మందితో ఈనెల 23వ తేదీన ఆ స్వగ్రామం నుంచి బయలుదేరారు. అతను 24న సాయంత్రం మండలంలోని లొల్ల గ్రామంలోని మకాం వద్దకు చేరుకున్నారు అప్పటికే గణేష్ మాజీ అనారోగ్యంతో ఉన్నారు. 25న వడ నాట్లు వేసేందుకు గణేష్ మాజీ కూలీలతో వెళ్లి అనారోగ్యంతో ఉండడంతో అతను పని చేయకుండా సాయంత్రం వరకు వారితోనే ఉన్నారు. ఆరోజు సాయంత్రం అతను తోటి కూలీలతో కలిసి మకాం వద్దకు వెళ్లిన తర్వాత కనబడలేదు. దీంతో తోటి కూలీలు, స్థానికులు చుట్టుపక్కల ప్రాంతాలు వెతికినప్పటికీ అతని ఆచూకీ లభ్యం కాలేదు. 27వ తేదీ శుక్రవారం ఉదయం కట్టుంగ గ్రామ పరిధిలోని గన్నవరం కాలువ సమీపంలో ఒక వ్యక్తి పడి ఉన్నాడంటూ స్థానిక రైతు పోలీసులకు ఫోన్ చేశారు. దీంతో పోలీసులు, తోటి కూలీలు అక్కడ చేరుకుని అతని కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఆసుపత్రి నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.రాము తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని చొల్లంగి వద్ద జాతీయ రహదారి 216పై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి ఎస్ఐ పి. సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ ఏటిమొగకు చెందిన పాలెపు వీరబాబు మత్స్యపాలెంలోని తన అత్తవారింటికి మోటార్ సైకిల్‌పై బయలుదేరారు. చొల్లంగి రైస్ మిల్ సమీపంలో ఎదురుగా యానాం నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న కోరంగి ఎస్ఐ. పి.సత్యనారాయణ క్షతగాత్రుని 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైక్రో ఇరిగేషన్ ఇంజినీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఔట్‌సోర్సింగ్ విధానంలో మైక్రో ఇరిగేషన్ ఇంజినీరు పోస్టుల భర్తీ కోసం ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎపిఎంఐపి పథక సంచాలకుడు, జిల్లా సూక్ష్మ సేద్య అధికారి ఎ.దుర్గేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు ఎపి సూక్ష్మ సేద్య పథకం రాజమహేంద్రవరం కార్యాలయంలో విధులను నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. బి.టెక్ (అగ్రికల్చర్ ఇంజనీరింగ్) విద్యార్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులతో పాటు ఎస్ఎస్‌సి ఇతర విద్యార్హతల మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రాలను విధిగా సంబంధిత కార్యాలయం ఇ-మెయిల్ pmiprecruitment@gmail.comకు జనవరి 18 సాయంత్రం 5.00 గంటల్లోపు పంపాలని తెలిపారు. జనవరి 22న ఉదయం 10.30 గంటలకు వైటిసి భవనం, రూరల్ తహశీల్దారు కార్యాలయం పక్క, బొమ్మూరులోని పిఎంఐపి కార్యాలయం వద్ద మౌఖిక పరీక్షకు అన్ని ధ్రువపత్రాలు, ఒక ప్రతి నకలుతో హాజరవ్వాలని తెలిపారు.

ఆవేదన... ఆందోళన...

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ వారంలో కురిసిన వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురి చేశాయి. రైతులు ధాన్యం ఆరబెట్టుకునే సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వ వైఫల్యం మరోసారి తేటతెల్లమైంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 5.50 లక్షల ఎకరాల్లో వరిసాగు జరిగిన విషయం విదితమే. కోనసీమ, కాకినాడ జిల్లాల్లో వర్షం ప్రభావం అధికంగా ఉంది. ఆరుగాలం కష్టించి పంట చేతికొచ్చే నాటికి కురిసిన అకాల వర్షాల ఫలితంగా నష్టాలు తప్పడం లేదనే ఆవేదన రైతుల్లో వ్యక్తమైంది. కల్లాలలోని ధాన్యం ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు ఇబ్బందులు తప్పలేదు. వ్యవసాయ ఆధారిత ఈ జిల్లాలో అత్యధిక మంది సాగుపై ఆధారపడి జీవిస్తున్నారు. పాలక ప్రభుత్వాలు అన్నదాతల సమస్యలపై చిత్తశుద్ధి లోపించింది. గతంలో బరకాలు పంపిణీ జరిగేది. ఆరేళ్లుగా ఆ దిశగా ప్రయత్నం జరగలేదు. మరో వైపు కొనుగోళ్ల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. దిగుబడుల్లో కొనుగోలు లక్ష్యం 60 శాతానికి మించడం లేదు. కొనుగోలు ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలు అడ్డుగోడలుగా మారుతున్నాయి. దీంతో రైతులు దళారులను ఆశ్రయించక తప్పడం లేదు. నూతన ప్రభుత్వమైనా అన్నదాతలను ప్రోత్సహించే దిశగా అడుగులు వేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

జీడిపిక్కల కార్మికుల ఉద్యమం ఉధృతం

చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ మూసివేతతో కార్మికులు చేపట్టిన ఆందోళనలు మిన్నంటాయి. రెండు నెలలుగా కార్మికులు శాంతియుతంగా నిరసనలు తెలిపినప్పటికీ పాలనా యంత్రాంగం జోక్యం చేసుకోకపోవడం పలు విమర్శలకు దారి తీసింది. ఆందోళన కార్యక్రమాలలో భాగంగా ప్రతిపాడు ఎంఎల్‌ఎ ఇంటి వద్ద చేపట్టిన ఆందోళనలను పోలీసులు భగ్నం చేసేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది. తమ సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ఆందోళనలపై ఎంఎల్‌ఎ సమాధానం ఇవ్వాలంటూ కార్మికులు ఆందోళనలను కొనసాగించారు. దీంతో ఎట్టకేలకు ఎంఎల్‌ఎ తన నివాసం నుంచి బయటకు వచ్చి కార్మికులతో మాట్లాడారు. ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చిస్తామంటూ హామీ ఇవ్వడంతో కార్మికులు ఎంఎల్‌ఎ ఇంటి ఎదుట ఆందోళన విరమించారు. రాజమమహేంద్రవరంలోని ఎపి పేపరు మిల్లు యాజమాన్య ప్రతినిధులు, కార్మిక సంఘాలతో కలెక్టరు అధ్యక్షతన జరిగిన సమావేశంలోనూ యాజమాన్య మొండి వైఖరి తేటతెల్లమైంది. కార్మిక సంఘాల ప్రతినిధులు వివరించిన సమస్యలపై ప్రజా ప్రతినిధులు ఏకీభవించారు. ఎపి పేపరు మిల్లుయాజమాన్యం కార్మికుల వేతన ఒప్పందంపై సానుకూలంగా స్పందించటంతో పాటు ప్రభుత్వానికి పన్ను బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరారు.

విద్యుత్ ఉద్యమం మరో మైలు రాయి

విద్యుత్ బిల్లులకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలు మిన్నంటాయి. విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ ఎన్నికల ముందు కూటమి తరపున టిడిపి అధినేత చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం విదితమే. అధికారంలోకి వచ్చిన 6 నెలలో విద్యుత్ ఛార్జీలు పెంచి తన వైఖరిని దర్పణం పట్టారు. ఈ నేపథ్యంలో తాజాగా చలికాలంలోనూ విద్యుత్ బిల్లులు అధికంగా రావటంతో ప్రజలలో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రజా ఆందోళనల నేపథ్యంలో ప్రతిపక్ష వైసిపి కూడా ఆందోళన బాటపట్టింది. విద్యుత్ ఛార్జీలపై జిల్లావ్యాప్తంగా ఆందోళనలను నిర్వహించింది. ఈ కార్యక్రమాలకు ప్రజాభాగస్వామ్యం క్రమ క్రమంగా పెరుగుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా విద్యుత్ ఛార్జీల భారాలను ఉపసంహరించుకోవాలని ప్రజలు, ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

స్ఫూర్తి నింపిన మహాసభలు

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించే వామపక్ష పార్టీల మహాసభలు ఈ వారంలో ఉత్సాహంగా జరిగాయి. కాకినాడ జిల్లా మహాసభల నేపథ్యంలో పెద్దాపురం పట్టణం ఎరుపెక్కిన విషయం విదితమే. వేలాది మంది కార్యకర్తలు, ప్రజలు, ఉద్యోగులు పాల్గొన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సిపిఎం మహాసభలు జరిగాయి. ఈ మహాసభలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో సహా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హాజరై దిశానిర్దేశం చేశారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. ప్రజా చైతన్యంతోనే పాలకుల దుశ్చర్యలను అడ్డుకోగలమని పిలుపునిచ్చారు. నూతన కమిటీలతో సమరోత్సాహంతో ప్రజా సమస్యలపై పోరుకు కామ్రేడ్లు సన్నద్ధమయ్యారు.

యానాం వార్తలు

వృద్ధులకు దుస్తులు, చెప్పులు ఇవ్వాలి

ప్రజాశక్తి - యానాం

సోషల్ వెల్ఫేర్ శాఖ ద్వారా వద్ధులకు ఉచితంగా అందించే దుస్తులు, చెప్పులను తక్షణమే ఇవ్వాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అర్థాని దినేష్ కోరారు. శనివారం పరిపాలనాధికారి కార్యాలయంలో ఆర్ఎఒ మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ శాఖ నుంచి వృద్ధులకు అందజేసే దుస్తులు, చెప్పులు మూడు నెలల క్రితమే వచ్చాయన్నారు. నాటి నుంచి వాటిని వృద్ధులకు ఇవ్వడం లేదని, గోదాముల్లో ఉన్న వాటిని ఎలుకలు పాడు చేస్తున్నాయని అన్నారు. తక్షణమే చర్యలు తీసుకుని వృద్ధులకు వాటిని అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విసికె పార్టీ సెక్రటరీ మెల్లం చిన్నా పాల్గొన్నారు.

30న యానాం యూత్ క్రిస్మస్

ప్రజాశక్తి - యానాం

యానాం క్రిష్టియన్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 30న స్థానిక బస్ కాంప్లెక్స్ ఆవరణలోని మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియంలో యానాం యూత్ క్రిస్మస్‌ను నిర్వహించనున్నట్టు ఎవాంజలిస్ట్ మారెళ్ల స్టీవెన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. యానాం, తాళ్లరేవు పాస్టర్ ఫెలోషిప్ ప్రార్థనా సహకారంతో యూత్ క్రిస్మస్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ సువార్తికులు డాక్టర్ జాన్ వెస్లీ పాల్గొని క్రిస్మస్ సందేశం ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వైద్య శిబిరం ప్రారంభిస్తున్న జనార్ధనరావు

1000 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తాళ్లపూడి

మానవతా సేవా సంస్థ వివిధ రూపాలలో ప్రజలకు అందిస్తున్న సేవలు శిబిరాలు అవసరమైన వారు ఉపయోగించుకోవాలని మండల మానవత శాఖ గౌరవ చైర్మన్ సింహాద్రి జనార్ధనరావు అన్నారు. మానవత శాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం జిఎస్‌ఎల్ ఆసుపత్రి సహకారంతో తాళ్లపూడిలో శనివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని జనార్ధన రావు ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో వెయ్యి మందికి వైద్య సేవలందించారు. సొలస సత్యనారాయణ దమయంతి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో జిఎస్‌ఎల్ ఆసుపత్రికి చెందిన వివిధ విభాగాలకు చెందిన 30 మంది వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఉచిత పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత సేవా సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్ పాల్గొన్నారు.

చాగల్లులో ఎస్‌సి కులగణన సర్వే

ప్రజాశక్తి -చాగల్లు

మండలంలో అన్ని గ్రామాల పరిధిలో ఎస్‌సి కుల గణనను ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రచురించినట్టు ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి తెలిపారు. ఎస్‌సి కులాల జాబితాను స్వయంగా పరిశీలించుకొని ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 31 తేదీ లోగా సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకుని సరిచేయించు కొనవలసినదిగా సూచించారు. దీనిపై మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రచారం చేసినట్టు తెలిపారు.

'కట్టా' కుటుంబానికి వేణు పరామర్శ

ప్రజాశక్తి -కడియం

ఇటీవల మాత వియోగంతో బాధ పడుతున్న మండలంలోని వేమగిరికి చెందిన వైసిపి నాయకుడు కట్టా జమిందార్ కుటుంబాన్ని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ శనివారం పరామర్శించారు. కట్టా కుటుంబ సభ్యులకు సానుభూతి తెలపారు. కట్టా విజయలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, వైసిపి మండల అధ్యక్షుడు జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ తదితరులు ఉన్నారు.

ఎపి ఎన్‌జిఒ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరూ ఐక్యంగా ముందుకు సాగి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా విధులు నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు, కార్యదర్శి జై కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పాలిక రాజబాబు, కోశాధికారి కెఎన్.గౌరీశంకర్, సహాధ్యక్షుడు బి.లక్ష్మణుడు, ఉపాధ్యక్షుడు పిఎస్.శేషుకుమార్, ఎస్.సత్తిరాజు, ఎం.సతీష్ కుమార్, కె.శ్రీనివాసరాజు, ఆదిత్య సోమేశ్వర్, ఎస్.వసుదేవి, ఎవివి.రామారావు, నూకరాజు, గోపి, రమేష్, ఎ.శ్రీనివాస్, కుమారి, కుమారస్వామి, సురేష్ బాబు, అర్జునరావు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

లూథరన్ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-గోపాలపురం

ఉప్పరగూడెంలోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని తెల్లవారుజామున క్యారల్స్ నిర్వహించారు. దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. పశువుల పాకను ఏర్పాటు చేశారు. చర్చ్ పాస్టర్ బూరిగ డానియల్ అభిలాష్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు ఎప్పటికీ ప్రపంచంలోని మానవులకి మార్గదర్శమని అన్నారు. ఏసు ప్రభువు ఆదర్శాలను గౌరవించడానికి క్రిస్మస్ సంతోషకరమైన సందర్భమని తెలిపారు. క్రైస్తవులకు అత్యంత పవిత్రమైన పండుగ దినం క్రిస్మస్ అన్నారు. అనంతరం నిర్వహించిన క్యాండిల్ సర్వీస్ ఎంతో ఆకట్టుకుంది. ప్రత్యేక ప్రార్థనలు, పిల్లలు డాన్సులు, ఏసు పుట్టుక నాటికలు ఆకట్టుకున్నాయి. అనంతరం కేక్ కట్ చేసి చేసి స్వీట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో దున్న కరుణాకర్, జానపాటి జోహార్, ఝూన్సీబాబు, కె.ఏసుదాసు, రత్న భాస్కర్, ఆర్.చంద్రరావు, దున్నా రాజబాబు, జీవన్, కిషోర్ పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో అలరించిన చిన్నారుల నృత్యాలు

జెడ్‌పి పాఠశాలలో సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి - సీతానగరం

వెదుళ్లపల్లి జెడ్‌పి పాఠశాలలో శనివారం సీతానగరం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలు నిర్వహించారు. ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి గణితం, పిఎస్, ఎన్‌ఎస్, బయాలజీ, స్పేస్ సైన్స్, కంప్యూటర్, బయోటెక్నాలజీ సైన్స్, టెక్నాలజీ వంటి వివిధ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్న ఈ సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థి వ్యక్తిగతంగా, విద్యార్థులు గ్రూపుగా, టీచర్ ఇలా మూడు కేటగిరీలలో పోటీలు నిర్వహించారు. హెచ్ఎంలు కోలా సత్యనారాయణ, త్రినాథ్‌రావు హాజరై, విద్యార్థులకు తగిన సూచనలు ఇచ్చారు. వ్యాఖ్యాతగా కె.సతీష్ బాబు వ్యవహరించగా మోహన్ రావు, ఝాన్సీ, సతీష్ మాస్టారు జడ్జిలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో టీచర్ కేటగిరీలో జి.శేఖర్, వ్యక్తిగత విభాగంలో గీతా సాయి ప్రభు (రఘుదేవపురం), విద్యార్థుల గ్రూపు విభాగంలో ప్రసాద్, మూర్తి (బొబ్బిలంక) గెలుపొందారు. ఈ కార్యక్రమంలో జివివి.సత్యనారాయణ, అద్దేపల్లి సత్యనారాయణ, మోహన్, పోసియ్య, వెదుళ్లపల్లి పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం శ్రీనివాస్, సిఆర్‌పి ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తాం

ప్రజాశక్తి - కోరుకొండ

రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన పౌరసరఫరాల శాఖ మంత్రి జిల్లా పర్యటన ముగించుకుని తిరిగి వెళుతూ మండలంలోని జంబూపట్నంలో రోడ్లపై ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మీడియాతో మాట్లాడి రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎవరూ అధైర్యపడవద్దని తెలిపారు. ఇప్పటి వరకూ రైతుల వద్ద నుండి 2 లక్షల 47 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి వారి అకౌంట్‌లకు రూ.6 వేల కోట్లు జమ చేసినట్టు తెలిపారు. వ్యవసాయాన్ని లాభసాటి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్, రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

ఎస్‌సిల సర్వే జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

షెడ్యూల్డ్ కులాల సర్వే జాబితాపై పౌరులు లేదా ఏదైనా మూడో పక్షం ఫిర్యాదులు లేదా అభ్యంతరాలను లేవనెత్త వచ్చునని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సంబంధిత సెక్రటేరియట్‌లోని విఆర్‌ఒ ఫిర్యాదులు లేదా అభ్యంతరాలను సేకరించి వాటిని పోర్టల్‌లో డిజిటలైజ్ చేస్తారన్నారు. విచారణ సందర్భంలో కనుగొన్న వాటి ఆధారంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు సిఫార్సులను సిద్ధం చేసి నివేదిక అందజేయాల్సి ఉంటుందన్నారు. ఆ మేరకు ఆర్ఐ సిఫార్సులను ధ్రువీకరిస్తారని, ఆ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా అన్ని అంశాలూ పరిగణిస్తారని తెలిపారు. అవసరమైన ఆమోదాల కోసం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ధ్రువీకరించిన సిఫార్సులను తహశీల్దార్‌కు పంపిస్తారని తెలిపారు. తహశీల్దార్ సమీక్షను పూర్తి చేసిన తర్వాత, తుది నిర్ణయాన్ని పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. కులాల సర్వే నివేదికను ప్రచురించే ప్రక్రియను పూర్తి చేయడానికి కార్యాచరణ ప్రణాళిక నిర్ణయించినట్లు తెలిపారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి -తాళ్లపూడి

విద్యార్థుల అవసరాలను తీరుస్తూ అన్ని సమయాల్లోనూ వారికి అండగా ఉంటున్న మండల గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు, రమాదేవి దంపతులు ఔదార్యం ఎనలేనిదని పెద్దేవం జిఎస్‌ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం నాగేంద్ర అన్నారు. ఈ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను జోడాల దంపతులు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పలు పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న విధంగా ఈ సంవత్సరం కూడా అందజేస్తామని తెలిపారు. రానున్న కాలంలో నవోదయ, మెరిట్ స్కాలర్‌షిప్ వంటి పోటీ పరీక్షలు అవసరమైన మెటీరియల్ కూడా అందజేస్తాయని అన్నారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి కూడా అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు అండగా ఉండటానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో దాతలతో పాటు శాంతి కుమారి, పాఠశాల ఉపాధ్యాయ బందం జామి సత్యనారాయణ, మధు కుమార్, రాజేష్, శ్రీనివాస్, మధులత తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రలో వృద్ధునికి ఆశ్రయం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

ఆయనకు ఏ సమస్య వచ్చిందో లేదా ఏదైనా మానసిక సమస్యతో బాధ పడుతున్నారో తెలియదు. ఇల్లు విడిచి రోడ్డున పడ్డాడు. స్థానిక యువకులు మానవతా హదయంతో రాజానగరం పోలీసులను సంప్రదించారు. రాజానగరం పోలీసులు రాజమండ్రి స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వద్ధాశ్రమ నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబును సంప్రదించి ఆ వృద్ధునికి ఆశ్రయం కల్పించారు. గుంటూరు జిల్లా నరసరావుపేట మండలం వినుకొండకు చెందిన వి.చిన్నపుల్లయ్య కోలమూరులో రోడ్డు పక్కన ఉండగా గమనించిన యువత ఆయనకు సపర్యలు చేసి భోజనం, దుస్తులు అందించారు. రాజానగరం పోలీసుల సహకారంతో స్వర్ణాంధ్ర వద్ధాశ్రమానికి చేర్చారు. స్వర్ణాంధ్ర వద్ధాశ్రమ నిర్వాహకులు రాంబాబు ఆ వద్ధునితో ముచ్చటించి వివరాలు తెలుసుకొని ఆశ్రయం కల్పించారు. పత్రికల ద్వారా వారి కుటుంబ సభ్యులకు ఆచూకీ తెలపడం ద్వారా ఆయనను వారి కుటుంబ సభ్యులకి అప్పగిస్తామని తెలిపారు.

అవగాహన సదస్సులో పాల్గొన్న లబ్ధిదారులు, సిబ్బంది

గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన

ప్రజాశక్తి -గోకవరం

మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీలో శనివారం గృహ నిర్మాణ లబ్ధిదారులకు పంచాయతీ కార్యదర్శి చిన్న కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గోకవరం ఎంపిడిఒ ఎం.గోవింద్ పాల్గొని మాట్లాడారు. కొత్తపల్లి గ్రామంలో 155 మందికి నూతన గృహాలు మంజూరయ్యాయని, అందులో 63 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారని, 64 మంది ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్, 4 ఇళ్లు రూఫ్ లెవెల్‌లో ఉన్నాయని తెలిపారు. 24 మంది ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టలేదని తెలిపారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్లు త్వరితగతిని పూర్తి చేయాలని లబ్ధిదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాటమస్వామి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ రామకృష్ణ, హౌసింగ్ సిబ్బంది, అసిస్టెంట్ ఇంజనీర్లు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైస్తవులకు సామూహిక భోజనాలు

ప్రజాశక్తి -కడియం

కడియపులంక సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో క్రిస్మస్‌ను పురస్కరించుకొని శనివారం సెయింట్ జాన్స్ లూథరన్ యూత్ సంఘం ఆధ్వర్యంలో సామూహిక భోజనాలు ఏర్పాటు చేశారు. 71 సంవత్సరాలుగా డిసెంబర్ 28న క్రమం తప్పక భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు సంఘ పెద్దలు వెల్లడించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రార్థనలో పేరిష్ సంఘం పాస్టర్ జి.వరప్రసాద్, సంఘ సిఆర్ వీరవల్లి నవీన్ కుమార్ మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘ సభ్యులు క్రిస్మస్ మధురగీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో సంఘ డెలిగేట్ కొప్పుల విజయకుమార్, సంఘ ట్రెజరర్ సబ్బితి అబ్బులు మాస్టారు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి -చాగల్లు

చాగల్లులో జనవరి 8వ తేదీ వరకూ నిర్వహించనున్న ఎన్‌టిఆర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను శనివానం ప్రారంభించారు. పంచదార రమేష్, దొంగ దుర్గ ప్రసాద్, చెరుకూరి సీతారామ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను టిడిపి నాయకులు నెలటూరు గ్రామ సర్పంచ్ యడ్లపల్లి ఉమా రజిని, కోడూరు ప్రసాద్, యడ్లపల్లి రకారావు ప్రారంభించారు.

పాస్ పోర్ట్ పడిపోయింది

పి గన్నవరం మండలం నరేంద్రపురం గ్రామాని కి చెందిన కుసుమ సంపూర్ణ కుమారి W/o కుసుమ అర్జున్ రావు కు చెందిన **Y1469301** నెంబరు కల పాస్ పోర్ట్ పడిపోయినది. జిరాక్స్ నిమిత్తము ఈ నెల 23వ తేదీన నరేంద్రపురం నుండి పి.గన్నవరం వచ్చుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికిన వారు క్రింది అడ్రస్ కు అందజేయగలరు.

కుసుమ సంపూర్ణ కుమారి,
W/o కుసుమ అర్జున్ రావు,
నరేంద్రపురం,పి గన్నవరం మండలం-533229,
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,
సెల్ :6301003659

మహారాజశ్రీ కాకినాడ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

I.A. No. 208/2021 in **A.S. No. 27/2021**

Between:

మానేపల్లి సుబ్రహ్మణ్యం **-పిటీషనర్/అపిలెంటు**

మరియు

కవులూరి భవాని, వగైరా **-రెస్పాండెంట్స్/ రెస్పాండెంట్స్**

R-4: బేతల తులసి, W/o. రాజు, డో.నెం. 57-9-66, మల్లిఖార్జున నగర్, రాజమహేంద్రవరం.
R-8: మానేపల్లి చిరంజీవులు, W/o. వెంకటేశ్వరులు, డో.నెం. 49-3-5, సామర్లకోట.
R-10: మానేపల్లి రఘు, S/o. వెంకటేశ్వరులు, డో.నెం. 49-3-5, సామర్లకోట.
R-11: ఇంజరపు నాగమణి, W/o. సత్యనారాయణ, డో.నెం. 49-3-5, సామర్లకోట.
R-12: కోటిపల్లి వెంకటలక్ష్మి, W/o. వీరబాబు, డో.నెం. 11-4-21, వీర్రాఘవపురం, సామర్లకోట.

పై నెంబరు అప్పీలు పిటీషనులో శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపిన తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు పబ్లికేషను ద్వారా మీకు నోటీసు పంపడమైనది. కావున మీరు **ది. 06-01-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టులో హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్పు ఇచ్చెదరు.

టి.పి.ఆర్.చంద్రశేఖర్, అడ్వకేట్
కాకినాడ, సెల్: 9440337629

మహారాజశ్రీ కాకినాడ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

A.S. No. 27/2021

Between:

మానేపల్లి సుబ్రహ్మణ్యం **-అపిలెంటు**

మరియు

కవులూరి భవాని, వగైరా **-రెస్పాండెంట్స్**

R-4: బేతల తులసి, W/o. రాజు, డో.నెం. 57-9-66, మల్లిఖార్జున నగర్, రాజమహేంద్రవరం.
R-8: మానేపల్లి చిరంజీవులు, W/o. వెంకటేశ్వరులు, డో.నెం. 49-3-5, సామర్లకోట.
R-10: మానేపల్లి రఘు, S/o. వెంకటేశ్వరులు, డో.నెం. 49-3-5, సామర్లకోట.
R-11: ఇంజరపు నాగమణి, W/o. సత్యనారాయణ, డో.నెం. 49-3-5, సామర్లకోట.
R-12: కోటిపల్లి వెంకటలక్ష్మి, W/o. వీరబాబు, డో.నెం. 11-4-21, వీర్రాఘవపురం, సామర్లకోట.

పై కేసులో కోర్టు వారు మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపిన తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు పబ్లికేషను ద్వారా మీకు నోటీసు పంపడమైనది. కావున మీరు **ది. 06-01-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టులో హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్పు ఇచ్చెదరు.

టి.పి.ఆర్.చంద్రశేఖర్, అడ్వకేట్
కాకినాడ, సెల్: 9440337629